**అతడు ఎండ అనక, వాన అనక కష్టపడి సంపాదించిన డబ్బు అనుభవించే యోగం ఎవరికీ లేదు. వయసులో ఉన్నప్పుడు ఒక్కగానొక్క చెల్లెలి మనసు తీర్చాలని గొలుసు చేయిస్తే దాన్ని మెడలో వేసుకోకుండానే ఆమె పోయింది. భార్య మనసు తీర్చాలని గాజులు చేయిస్తే ఆమె అతణ్ణి ఒంటరిచేసి పోయింది. మిగిలిన కుమార్తె కోసం ఒక చీర కొన్నాడతడు.**

ఎండ మండిపోతూంది. వడగాడ్పు బాగా కొడుతూంది. రివ్వున గాలి వీచినప్పుడల్లా వీథిలో దుమ్ము పైకి లేస్తూంది.

దుమ్ము కళ్లలో పడుతున్నా, వడగాలికి నోరు ఎండిపోతున్నా, ఒళ్లంతా చెమటలు కారుతున్నా మీనాక్షి ఆ కిటికీ దగ్గరినుంచి కదలటంలేదు.

ఎదురుగా చెట్టుక్రింద కుక్క కూర్చుని ఊరికే వగరుస్తూంది. ఇళ్ల తలుపులు మూసుకుని జనం ఆపసోపాలు పడుతున్నారు. మీనాక్షి లేచింది. కూజాలో నీళ్లు ఒక గ్లాసు తాగి, తువ్వాలుతో మొహం తుడుచుకుని మళ్లీ కిటికీ దగ్గర చేరింది.

మీనాక్షికి రోజూ ఉన్న పనుల్లో, మధ్యాహ్నం పూట ఆ కిటికీ దగ్గర కూర్చుని ఎదురుచూడటం పెద్ద పని. ఆమె అలా సంవత్సరాల నుంచి ఆ కిటికీ దగ్గర కూర్చుని ఎదురు చూస్తూంది.

దూరంగా ఏదో సైకిల్ వస్తూంది. మీనాక్షి జాగ్రత్తగా చూసింది. సైకిల్ ఊరి చివర కరణంగారి ఇంటిదగ్గర ఆగి, ఇంట్లోకి వెళ్లిపోయింది. కరణంగారి అబ్బాయి పక్క ఊరి హైస్కూల్ నుంచి ఇంటికి వచ్చాడు.

మీనాక్షి నిట్టూర్చింది. దూరంగా దుమ్ము లేస్తూంది. మట్టిరోడ్డు కావటంవల్ల దుమ్ముకి లోటు లేదు. మీనాక్షికి ఆ ఊరి రోడ్డుమీద కోపం వచ్చింది. సావిట్లో నడుం వాల్చిన మీనాక్షి తల్లి నిద్ర రాక విసుక్కుంటూంది.

'ఏమిటో ఈ ఎండలు ప్రతి ఏడూ ఎక్కువయి పోతున్నాయి' అనుకుంది మీనాక్షి. రోజుకోసారి అలా అనుకుంటూనే ఉంటుంది. దూరంగా మరో సైకిల్ వస్తూంది. సైకిల్‌మీది మనిషి కాకీబట్టలు చూసిన మీనాక్షి, చప్పున తలుపు తీసి వీథిలోకి వచ్చింది. అరుగుమీది స్తంభానికానుకుని నిలబడింది. ఎర్ర సైకిల్‌మీద, కాకీ బట్టలతో ఉన్నాడు పోస్ట్‌మన్. సైకిల్ కరణంగారి ఇంటి దగ్గర కొంతసేపు ఆపాడు. మళ్లీ బయలుదేరాడు.

సుందర్రావుగారి ఇంటి దగ్గర మళ్లీ ఆగాడు పోస్ట్‌మన్. మీనాక్షి విసుక్కుంది. 'చప్పున రా, తాతా' అనుకుంది. సుందర్రావుగారి ఇంటి ముందు ఎర్రసైకిల్ బయలుదేరగానే మీనాక్షి సంబరపడింది. ఇక తమ ఇంటిదగ్గర తప్పించి మధ్యలో ఆ సైకిల్ ఆగదని ఆమెకు తెలుసు. ఎందుకంటే దారిలో ఉన్న ఆ నాలుగిళ్ల వాళ్లకి ఎప్పుడూ ఉత్తరాలు రావు. పోస్ట్‌మన్ మెల్లిగా వచ్చి సైకిల్‌ని అరుగుకి చేరబెట్టాడు.

"ఏమిటి, తాతా, ఇంత ఆలస్యం చేశావు? చూశావా! నీ కోసం రెండు గంటలనుంచి ఇంత ఎండలో ఎదురు చూస్తున్నాను. రోజూ నీ కెన్నిసార్లు చెప్పినా చప్పున రావుకదా?" రోజూ ఇలా అడగటం మీనాక్షికి అలవాటు.

"ఎలా, తల్లీ, రావటం! టపా రాగానే ముద్రలు వేసి, ఈ మూడు మైళ్లు సైకిల్ తొక్కేసరికి ఇంత సేపవుతూంది. పైగా, ఎండ చూశావా, ఎలా మండిపోతూందో!" తన తోలుసంచీ విప్పుతూ అన్నాడు పోస్ట్‌మన్.

"నాకు ఉత్తరం వచ్చిందా ఈ వేళయినా?" అడిగింది మీనాక్షి.

"వచ్చిందమ్మా!"

సంచీలోనుంచి కార్డు తీసి ఇచ్చాడు పోస్ట్‌మన్. మీనాక్షి ఉత్తరం తీసుకుంది. చదువుకుని ఉత్తరాన్ని ముద్దు పెట్టుకుంది.

"ఎక్కడి నుంచమ్మా?" అడిగాడు పోస్ట్‌మన్.

"బాబు దగ్గరినుంచి, తాతా! బాగా చదువుకుంటున్నానని, స్కూల్లో చదువుల్లోనూ, ఆటల్లోనూ ఫస్ట్ వచ్చానని రాశాడు" అంది మీనాక్షి.

"సంతోషమమ్మా!" అన్నాడు పోస్ట్‌మన్, అరుగుమీది స్తంభానానుకుని కూర్చుంటూ.

మీనాక్షి ఉత్తరం ఇంకోసారి చదువుకుంటూంది. తాత నుదుటికి పట్టిన చెమట తుడుచుకుంటున్నాడు. టోపీ తీశాడు. తలంతా ముగ్గుబుట్టయి పోయింది. మొహమంతా ముడతలు పడి పోయింది.

'రామా! కృష్ణా' అంటూ నిట్టూర్చాడు తాత.

మీనాక్షి తల ఎత్తింది. తాత ముఖం ఎర్రగా వాడిపోయింది. తెల్లటి ఒళ్లు మూలాన బాగా కంది పోయింది.

"అయినా, ఈ వయసులో నీకు ఉద్యోగం ఎందుకు, తాతా? హాయిగా 'కృష్ణా, రామా' అనుకుంటూ నీ కూతురి దగ్గర ఉండరాదా?" మీనాక్షి అడిగింది.

తాత మాట్లాడలేదు. తల వంచుకుని కాళ్లకేసి చూసుకున్నాడు. అరిగిపోయిన చెప్పులు కనిపించాయి.

మీనాక్షి ఉత్తరాన్ని మళ్లీ ముద్దు పెట్టుకుంది. తాత వీథికేసి చూసి నిట్టూర్చాడు. నాలికతో పెదిమలు తడుపుకున్నాడు.

"మంచినీళ్లు కావాలా, తాతా?" అడిగింది మీనాక్షి.

"ఇయ్యమ్మా! ఎన్ని నీళ్లు తాగినా దాహం తీరటం లేదు" అన్నాడు తాత, చొక్కా ఇత్తడి గుండీలు విప్పుకుంటూ.

మీనాక్షి ఇంట్లోకి వెళ్లింది. తల్లిని లేపి ఉత్తరం ఇచ్చింది. గ్లాసులో మజ్జిగ పోసి, ఉప్పు వేసి తెచ్చిం

"ఈ మజ్జిగ తాగు, తాతా

అంది.

తాత మజ్జిగ గ్లాసుకేసి అప్యాయం చూశాడు. తరవాత మీనాక్షి కళ్లలో చూశాడు. "మజ్జిగ ఎందుకమ్మా మంచినీళ్లు చాలుకదా" అన్నాడు

"పరవాలేదులే, తాతా! తాగు మీనాక్షి గ్లాసు అందించింది.

తాత మజ్జిగ తాగి గ్లాసు పక్క పెట్టాడు.

"తాతా! ఓ ప్రశ్న అడుగుతా జవాబు చెపుతావా?" మీనా అరుగుమీద కూర్చుంటూ అడిగిం

"అడుగమ్మా" అన్నాడు తా


"రోజూ నువ్వు ఇలా ఉత్తరా తీసుకురావడం, ఎండలో, వాన ఇల్లిల్లూ తిరిగి అందివ్వటం —! విసుగనిపించటం లేదూ?"

తాత తల గోక్కున్నాడు. మెల్లి అన్నాడు:

"లేదమ్మా! ఈ పని న అలవాటు అయిపోయింది. పైగా, పొ గడవాలంటే పని చెయ్యక తప్ప కదమ్మా!"

"నీ దంతా చాదస్తం, తా ఉన్న ఒక్క కూతురు నిన్ను కా టుందా? హాయిగా కూతురింట ఉండక నీ కీ బాధ ఎందుకు, చెప్పు

"లేదమ్మా! నీకు తెలియదు. ఒంట్లో శక్తి ఉన్నంతవరకూ, ఎ మన వాళ్లయినా, ఇతరుల మీ మనం ఆధారపడకూడదు. అయి నా కేమమ్మా! హాయిగా ఉంటున్నా




చిత్రం — ఎమ్. శంకర్రావు (విశాఖపట్టణం-2)



# పోస్ట్‌మన్

'ఉమ'



మీ కందరికీ ఉత్తరాలు ఇచ్చి, మీ మొహాల్లో సంతోషాన్ని చూడటంతో నాకు చాలా తృప్తి ఉందమ్మా."

"తాతా! మరి నువ్వు అందరికీ ఉత్తరాలు ఇస్తావు కదా. నీకు ఉత్తరాలు వస్తాయా?" అడిగింది మీనాక్షి కుతూహలంగా.

"నాకా!" నిట్టూర్చాడు తాత.

"నా కెవరున్నారు, తల్లీ? ఉన్నది ఒక్క కూతురు. దానికి చదువు రాదు. దాని మొగుడికీ చదువు రాదు."

మీనాక్షి తాత కాకీబట్టల కేసి చూసింది. చొక్కా చెయ్యి దగ్గర చిరిగింది. పాంట్ అడుగున కుట్లూడి, దారాలు కాళ్లమీద వేళ్లాడుతున్నాయి.

"చొక్కా చిరిగిపోయింది, తాతా! కుట్టుకోవేం?" మీనాక్షి అడిగింది.

"ఈ ముసలాడి చొక్కా ఎలా ఉంటేనేమమ్మా! అయినా, నా కెవ రున్నారు ఇక్కడ?"

"ఎవరూ లేకపోతే మాత్రం చిరిగిన చొక్కా నువ్వు కుట్టుకోలేవా?"

తాత మాట్లాడలేదు.

"సరిలే, నే కుట్టి పెడతాను. ఆ చొక్కా ఇలా ఇయ్యి" అంది మీనాక్షి లేచి నిలబడుతూ.

"వద్దులే, అమ్మా! నీ కెందుకు శ్రమ!" అన్నాడు తాత. తాతకి అభిమానం ఎక్కువ.

"ఏం ఫర్వాలేదు. ఇయ్యి. నీ కూతు రయితే కుట్టుతుందా, లేదా? నేనూ అంతే" అంది మీనాక్షి. తాత ఏమను కున్నాడో మెల్లిగా చొక్కా విప్పి ఇచ్చాడు. మీనాక్షి లోపలికి వెళ్లి సూదీ దారం తెచ్చింది.

"తాతా! నీ కొచ్చిన జీతం అంతా ఏం చేస్తావు?" అడిగింది మీనాక్షి, సూదిలో దారం ఎక్కిస్తూ.

"ఏం జీతంలే, అమ్మా! ఎంత తక్కువగా ఖర్చు పెట్టినా ఏం మిగలటం లేదు. జీతంలోంచి కొంత మిగిల్చి ఓ మొత్తం చెయ్యాలని నా ఆశ."

"ఇన్నేళ్లొచ్చినా నీకు డబ్బుమీద భ్రమ పోలేదు, తాతా! అందుకేనా ఈ తాపత్రయమంతా?" అంది మీనాక్షి, కుట్లు వేస్తూ.

"అలా అనకమ్మా. డబ్బు లేనిదే ఏమీ లేదు. మనిషి సుఖపడాలంటే డబ్బు కావాలి. నే నెలా ఉన్నా, నా కూతురు సుఖపడాలంటే డబ్బు కావాలి. అందుకేనమ్మా ఈ తాపత్రయమంతా" అన్నాడు తాత.

మీనాక్షి తాతకేసి చూస్తూ, సూది వేలికి గుచ్చుకుంది. వెంటనే వేలు నోట్లో పెట్టుకుంది.

"చూశావా, నే నొద్దంటే చొక్కా కుట్టుతానన్నావు? నా చొక్కా ఎలా ఉంటేనేం? దాని కోసం నువ్వు బాధ పడుతున్నావు." తాత నొచ్చుకుంటూ అన్నాడు.

"ఫరవాలేదులే, తాతా! మా ఆడవాళ్లకి ఇటువంటివి అలవాటేలే" అంది మీనాక్షి.

తాత చెప్పుకి ఊడిన ఉంగరాన్ని లోపలికి తోస్తూ అడిగాడు: "బాబు ఏ క్లాసులోకి వచ్చాడమ్మా?"

"ఆరులోకి వచ్చాడు, తాతా! హైస్కూల్లో చేర్పించారని రాశాడు."

"బాగా చదువుకోమని రాయమ్మా. పిల్లలు బాగా చదువుకోవాలి. నా కూతురు చదువుకోలేదు. ఉత్తరం ముక్కయినా రాయలేక పోతుంటే నాకు బాధగా ఉంది. అందరికీ ఉత్తరాలు నేను ఇవ్వటమే కాని, నాకు ఎప్పుడూ ఉత్తరాలురావు." తాత నిరాశగా అన్నాడు.

మీనాక్షి చొక్కా కుట్టడం పూర్తి చేసింది. దానిని తాతకి అందించింది. తాత చొక్కా తొడుక్కున్నాడు. చెప్పులు వేసుకుని లేచి నిలబడ్డాడు.

"వస్తానమ్మా. మళ్లీ ఈ ఊరి ఉత్తరాలు రైలు కందించాలి" అన్నాడు.

"సరే, తాతా! రేపు త్వరగా వచ్చెయ్యి. నీ కోసం ఎదురుచూస్తుంటాను" అంది మీనాక్షి.

"పిచ్చితల్లి! ఎందుకు చూడటం? ఈవేళ ఉత్తరం వచ్చేసిందిగా! మళ్లీ వారం వరకూ రాదు" అన్నాడు తాత సైకిల్ నిలబెట్టుతూ.

"ఏమో, తాతా? నాకు మాత్రం నీ కోసం ఎదురు చూడడం బాగా అలవాటయిపోయింది. లేకపోతే నాకు తోచదు. ఏదయినా సెలవు రోజున నువ్వు రాకపోతే నాకు ఆ రోజంతా ఎలాగో ఉంటుంది." మీనాక్షి ఖాళీ గ్లాసు తీసుకుంటూ అంది.

"అంతేనమ్మా! అలవాటయిన పనులు మానలేం. వస్తా, తల్లీ!" అంటూ తాత సైకి లెక్కాడు.

పాత సైకిల్ చప్పుడు చేస్తోంది. ఈడుస్తూ సైకిల్ తొక్కుతున్న పోస్ట్ తాతను చూసి నిట్టూర్చింది మీనాక్షి.

సైకిల్ కనుమరు గయ్యేవరకూ అరుగుమీద స్తంభా న్నానుకుని నిలబడింది. తరవాత ఇంట్లోకి వెళ్లి పోయింది.

* * *

కిటికీ దగ్గర కూర్చుని ఉంది మీనాక్షి. రోహిణీకార్తె ఎండ నిప్పులు చెరుగుతున్నట్లుంది. దుమ్ము లేస్తోంది. దూరంగా ఎర్రసైకిల్. దానిమీద కాకీబట్టల మనిషి కనిపించాడు. మీనాక్షి చప్పున లేచి వీధిలోకి వెళ్లి అరుగుమీద స్తంభా న్నానుకుని నిలబడింది.

పోస్ట్ తాత కరణంగారి ఇంటి దగ్గర ఆగలేదు. సుందర్రావుగారి ఇంటి దగ్గరకూడా ఆగలేదు. త్వరత్వరగా సైకిల్ తొక్కుకుంటూ వచ్చేస్తున్నాడు. తాత సంతోషంగా ఉన్నాడని మీనాక్షి అనుకుంది. 'ఆ సంతోషానికి కారణం ఏమై ఉంటుందా?' అని ఆలోచిస్తోంది.

ఎర్ర సైకిల్ ఇంటిముందు ఆగింది. తాత సైకిల్ దిగి, దాన్ని అరుగుకి చేరవేశాడు. అరుగుమీద కూలబడి ఆయాస పడుతున్నాడు. కళ్లు కాంతితో మిలమిల లాడుతున్నాయి.

"ఇంత ఎండలో అంత కంగారుగా రాకపోతేనేం, తాతా!! చూడు, ఎలా అలసిపోయావో?" అంది మీనాక్షి.

"లేదమ్మా. నా మనసు నీకు తెలియదు. ఈవేళ నేను చాలా సంతోషంగా ఉన్నాను. ఈ ఎండా, వడగాలీ నా కేం తెలియలేదు" అన్నాడు తాత ఆయాసపడుతూ.

"ఏమిటి విశేషం, తాతా? కూతురి దగ్గరికి వెళ్లావా? నీ కోసం రెండు రోజులనుంచి ఎదురుచూస్తున్నాను" అంది మీనాక్షి, అరుగు మీద కూర్చుంటూ.

"అవునమ్మా. నా కూతురు దగ్గరికే వెళ్లాను. నాకు మనవణ్ని ఇవ్వబోతూంది నా తల్లి!" ఆ పైన తాతకి మాటలు రాలేదు. నాలికతో పెదవులు తడుపుకున్నాడు.

"ఉండు, తాతా, మజ్జిగ తెస్తాను" అంటూ మీనాక్షి లోపలి కెళ్లింది. తాత టోపీ తీసి, ముఖానికి పట్టిన చెమట తుడుచుకుంటున్నాడు.

మీనాక్షి మజ్జిగ గ్లాసు అందించింది. మజ్జిగ తాగి, ఖాళీగ్లాసు పక్కన పెడుతూ మీసాలు తుడుచుకున్నాడు తాత.

"ఈ ఊళ్లోవా ళ్లందరికీ 'తాత' ని ఎప్పుడో అయిపోయాను. కాని, ఇన్నాళ్లకి నిజంగా తాతని అవుతున్నాను. నాకూ ఓ మనమడుపుట్టబోతున్నాడు." తాత సంతోషంతో మాట్లాడేస్తున్నాడు.

మిలమిలా మెరుస్తున్న తాత కళ్లవంకా, సంతోషం వల్ల తాత ముఖం మీద పడ్డ చిత్రమయిన ముడతల వంకా రెప్ప వెయ్యకుండా చూస్తోంది మీనాక్షి.

"నా తల్లికి మంచి పట్టుచీర ఒకటి కొంటానమ్మా. ఎన్నాళ్లనుంచో మనసు పడింది. ఎండనక, వాననక కష్టపడి సంపాదించిన నా డబ్బు ఖర్చు చెయ్యటానికి సరిఅయిన సమయం ఇదే కదమ్మా!"

తాత ఎందుకో ఆగాడు. ముఖకవళికలు ఒక్కసారి మారిపోయాయి.

"ఏమో?" అస్పష్టంగా గొణుక్కున్నాడు. బరువుగా నిట్టూర్చాడు.

"ఏమిటి, తాతా, అనుకుంటున్నావు?" అడిగింది మీనాక్షి.

"ఏం లేదమ్మా. ఏవో పాత సంగతులు గుర్తుకొస్తేనూ..." తాత ఆగాడు.

"చెప్పు, తాతా, వింటాను" అంది మీనాక్షి.

"నేను దౌర్భాగ్యుడినమ్మా. నా డబ్బు అనుభవించే యోగం ఎవరికీ లేదు. వయసులో ఉన్నప్పుడు ఒక్కగా నొక్క చెల్లెలి మనసు తీర్చాలని కష్టపడి డబ్బు కూడబెట్టి గొలుసు చేయించే సరికి, చెల్లి దాన్ని మెడలో వేసుకోకుండానే పోయింది. నా భార్య మనసు తీర్చాలని గాజులు చేయిస్తే, అదీ నన్ను ఒంటరినిచేసి పోయింది."

"పాపం!" నిట్టూర్చింది మీనాక్షి.

"నా డబ్బులో లోపం ఉందో, లేక నా దురదృష్టమో, ఎవరినీ నా డబ్బుతో సంతోషపెట్టలేకపోతున్నాను!" అప్పటి వరకూ మిలమిలలాడుతున్న తాత కళ్లు నీళ్లు నింపుకున్నాయి.

మీనాక్షికి తాతమీద జాలి వేసింది. "నీది మంచి హృదయం, తాతా. పోయినవాళ్లకి నీ ఆనందం పంచుకునే పాటి అదృష్టం లేకపోయింది" అంది. అంతకంటే ఏం చెప్పాలో మీనాక్షికి తోచలేదు. జాలిగా తాత మొహంలోకి చూసింది.

తాత జుట్టు సద్దుకుని, టోపీ పెట్టుకున్నాడు. "నిన్ను అనవసరంగా



# దేవగిరి కోట శిల్పం

దేవగిరి కోట ఔరంగాబాదుకు 18 మైళ్ల దూరంలో, ఎల్లోరా గుహలకు పోయే మార్గంలో ఉన్నది. హిందూ రాజులు ఎంతో శ్రమ కోర్చి కట్టిన కోట ఇది. దీనిని ముస్లిమ్ రాజులు వశపరుచుకొని, అచటనున్న దేవాలయమునుకూడా వారి మసీదుగా మార్చినారు. కోట పేరును కూడా 'దౌలతాబాదు కోట'గా మార్చినారు. కాని, మరల ఆ దేవాలయమును భారత మాత దేవాలయంగా మార్చినారు.

మన ప్రాచీనులు శిల్పకళ కెక్కువ ప్రాధాన్యము నిచ్చుటచేతనే నేడు మనం వాటిని చూడగలుగుతున్నాము. లేనిచో మన కసలు ఆ కళ చూసే అదృష్ట ముండెడిదికాదు. నేడు మనకంటే విదేశీయులే మన శిల్పకళకు ఎక్కువగా ప్రాధాన్యత నిచ్చుచున్నారు.

కాని, మన దురదృష్టం వలన, నేడు మనం పగిలి, విరిగిపోయిన శిలలనేతప్ప అసలైన శిల్పములను చూడలేకపోతున్నాము.

ఈ కోటలో చెప్పుకోదగిన విశేషం చాంద్‌మినార్. ఇది 540 అడుగుల ఎత్తు కలిగి, 10 అడుగుల వ్యాసం కలిగిఉన్నది.

మన శిల్పకళ రోజురోజుకూ దిగజారిపోతున్నది. ఒక విధంగా, నిజానికి అనలిప్పుడు మన శిల్పకళ పూర్తిగా లేదనే చెప్పవచ్చును. అంతేకాక ఇప్పుడున్న శిల్పములనుకూడా మనం దక్కించుకోలేక పోతున్నాము. కావున నేడు విరిగిన, పగిలిన శిల్పములే మనకు గతి. ★

రచన, ఫోటో:

దారం వినోద్

నా కథ చెప్పి బాధపెట్టానమ్మా" అన్నాడు.

"అబ్బే. లేదు, తాతా. మీకు మనమడు పుడుతున్నాడంటే నాకు మాత్రం సంతోషం కాదూ?" అంది మీనాక్షి.

"వస్తానమ్మా" అన్నాడు తాత సైకిల్ నడిపిస్తూ.

సైకిల్ మెల్లిగా మట్టిలో పోతూంది. మీనాక్షి లేచి స్తంభాన్నానుకుని నిలబడింది. చూస్తూండగా తాత కనుమరుగయ్యాడు. 'పాపం, ముసలాడు!' అనుకుంటూ ఇంట్లోకి వెళ్లింది.

* * *

రోజులు గడిచిపోతున్నాయి. మండుతున్న ఎండలు, వానల వల్ల ఆరిపోయాయి. మీనాక్షి రోజూ తాత కోసం ఎదురుచూస్తూంది. తాత వస్తున్నాడు. వాలని కొక ఉత్తరం తెచ్చి మీనాక్షికి ఇస్తున్నాడు.

ఓ రోజు తాత అన్నాడు: "నా తల్లి పురిటిరోజులు దగ్గర పడుతున్నాయమ్మా. ఇదే మొదటి కాన్పు . . . నా కెందుకో భయంగా ఉందమ్మా."

"ఏం భయం లేదు, తాతా. దేవుడు మంచివాళ్లకి ఎప్పుడూ అన్యాయం చెయ్యడు" అంది మీనాక్షి.

"నా కూతురి దగ్గరికి వెళ్లొస్తానమ్మా. నా మనస్సు బావులేదు" అన్నాడు తాత.

"నువ్వు రాకపోతే నాకు తోచదు, తాతా!" దిగులుగా అంది మీనాక్షి.

"ఎంతమ్మా! నాకు మనమడు పుట్టగానే వచ్చెయ్యనూ? నా సంతోషాన్ని పంచుకోవడానికి నీకంటె నాకు ఎక్కువయినవారు ఎవరున్నారమ్మా?" తాత నిలబడుతూ అన్నాడు.

". . ."

"వస్తానమ్మా"—సైకిల్ ఎక్కుతూ అన్నాడు తాత.

"మంచిది, తాతా" అంది మీనాక్షి. స్తంభాన్నానుకుని నిలబడి దూరంగా వెళుతున్న తాతను చూస్తూ, 'భగవంతుడా! ఈ ముసలాడి ఆనందాన్ని చంపకు' అనుకుంది.

* * *

తాత రాకపోయినా మీనాక్షికి భ్రమ తప్పలేదు. రోజూ కిటికీ దగ్గర తాత కోసం నిరీక్షిస్తూంది. నిరీక్షణ సాగిపోతూంది. ఒకటి, రెండు. . . ముప్ఫై రోజులు గడిచిపోయాయి.

'భగవంతుడా! తాత కూతురుకి ఏం జరగలేదు కదా?' అనుకుంది మీనాక్షి.

కిటికీ దగ్గర కూర్చుని ఎదురు చూస్తూంది. ఆకాశం తన నిర్మలత్వానికి స్వస్తి చెపుతూంది. మీనాక్షి మనసులోని ఆలోచనలలాగే, మేఘాలు ఆకాశంలో ముసురుకుంటున్నాయి. మీనాక్షికి దూరంగా ఎర్రసైకిల్,



నృత్య భంగిమ ఫోటో — పుష్ప (గుంటూరు—2)

ఖాకీ బట్టలు కనిపించాయి. త్వరగా వీధి తలుపు తీసుకుని, అరుగుమీది స్తంభాన్నానుకుని నిలబడింది.

సైకిల్ మెల్లిగా వస్తూంది. దూరంనుంచే తాత ముఖాన్ని చూడగలిగింది మీనాక్షి. ఆమె మనస్సు కీడు శంకించింది.

ఎర్రసైకిల్ వచ్చి ఆగింది. తాత ముఖం విచారానికి ప్రతిబింబంగా ఉంది. తాత అరుగుమీద కూర్చున్నాడు. టోపీ తీశాడు.

"దేవుడు తన ఆనవాయితీ తప్పలేదమ్మా" అన్నాడు మెల్లిగా.

"ఏమయింది, తాతా?" వణుకుతున్న గొంతుకతో ప్రశ్నించింది మీనాక్షి.

"నా సంతోషంతో నా కూతురు పాలు పంచుకోలేకపోయిందమ్మా. నా డబ్బుతో నే నెవర్నీ సంతోషపెట్టలేదు. నా కూతురు ప్రసవించలేక చచ్చిపోయిందమ్మా. నే పట్టుకువెళ్లిన పట్టుచీర మడత నలగకుండా అలా పెట్టెలోనే ఉందమ్మా!" ఆఖరి మాట పూర్తయ్యేసరికి తాతలో దుఃఖం పొంగింది. ఒక్కసారి చేతుల్లో మొహం దాచుకుని బావురుమన్నాడు.

మీనాక్షికి తాతని ఎలా ఊరడించాలో తెలియలేదు.

'అమ్మయినా ఈ సమయానికి ఇంట్లో ఉంటే బావుండేది' అనుకుంది.

తాత ఆగాడు. కళ్లు తుడుచుకున్నాడు. గట్టిగా అన్నాడు:

"నే నిక డబ్బు కూడబెట్టనమ్మా. ఉద్యోగం మానేస్తున్నాను. దేశాంతరం పోతున్నాను."

"తాతా!" అంది మీనాక్షి.

"అవునమ్మా. అన్నీ పోయిన నిర్భాగ్యుణ్ణి. ఎక్కడికో పోతాను, ఎక్కడో రాలిపోతాను."

"అలాంటి మాట లనకు, తాతా" అంది మీనాక్షి జాలిగా.

"పోయేటప్పుడు కొంచెమయినా మనశ్శాంతి పొందుదామని నీ వద్ద కొచ్చాను, తల్లీ! నా కున్న ఆప్తురాలివి నువ్వొక్కర్తివే." తాతలేచాడు. సైకిల్ దగ్గరికి వెళ్లాడు. సైకిల్‌కి తగిలించిన ఒక సంచీ తీశాడు.

వానజల్లు మొదలయింది. గాలి వీస్తూంది. తాత అరుగు ఎక్కాడు.

"పోయేముందు నిన్నయినా సంతోషపెట్టాలని నా ఆలోచన, తల్లీ! ఈ పట్టుచీర తీసుకో. కట్టుకుంటే లక్ష్మీదేవిలా ఉంటావు. నా డబ్బు ఆఖరికి నీ కయినా సంతోషం కలిగిస్తుందేమో?" అంటూ తాత మీనాక్షి చేతుల్లో ఓ పొట్లం పెట్టి, మెల్లిగా అరుగు దిగి సైకిల్ దగ్గరకి వెళ్లాడు.

"తాతా!" అంది మీనాక్షి.

"సంతోషంగా ఉండమ్మా" అంటూ తాత సైకిలెక్కి వానలో తడుస్తూ వెళ్లిపోతున్నాడు.

మీనాక్షి అరుగు చివరికి వెళ్లింది.

"నీ డబ్బు ఎవరినీ సంతోషపెట్టలేదు, తాతా! ఇది నిజం. ఈ పట్టుచీర కట్టుకునే యోగ్యత నాకు లేదు. నేను విధవని. పువ్వులు, గాజులు, బొట్టుమీద మనసు తీరక, అందరికీ దూరంగా ఈ ఊళ్లో ఉంటూ మనసు తీర్చుకుంటున్నాను, తాతా!" మీనాక్షి గొణిగింది.

తాతకి ఏమీ వినిపించలేదు. అలాగే వెళ్లిపోతున్నాడు.

మీనాక్షి అరుగు మీద కదలిక లేకుండా బొమ్మలా నిలబడి తాత వెళుతున్న వైపే చూస్తూంది. ★